క్లుప్తంగా

నేడు మంత్రాలమ్మ తల్లి తిరునాళ్ల

క్రోసూరు: క్రోసూరులోని చెరువుగట్టు వద్ద ఉన్న మంత్రాలమ్మతల్లి ఆలయ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం జరుగుతుందని నిర్వహక కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు



క్రోసూరు: క్రోసూరులోని సిద్దిపాలెం అభయాంజనేయస్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అశేషంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియ తనిఖీ



చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవాని శంకర్ శనివారం తనిఖీ చేశారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామ సచివాలయంలో నూతన రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియలో వస్తున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రక్రియ సజావుగా కొనసాగుతుందని డిజిటల్ అసిస్టెంట్ పి.రాంబాబు తహసీల్దార్‌కు వివరించారు. అక్కడే దరఖాస్తు చేసేందుకు వచ్చిన వారితోను తహసీల్దార్ మాట్లాడారు. ఆయనతో పాటు ఆర్ఐ ఆంజనేయులు, వీఆర్వో మాబువలి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన చందు బాలమోహన్‌రావు(46) వాహనంపై నుంచి కింద పడి గాయాలవ్వటంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రవిబాబు శనివారం తెలిపారు. ఈ నెల 21వ తేదీన చందు బాలమోహన్‌రావు, అదే గ్రామానికి చెందిన బస్సు కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై క్రోసూరు వైపు వస్తుండగా వెనుక కూర్చున్న బాలమోహన్‌రావు ప్రమాదవశాత్తూ కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వాహనం నడుపుతున్న కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా హనుమత్ రక్ష యాగం పూర్ణాహుతి

నూజెండ్ల: మండలంలోని రవ్వారం గ్రామ సమీపాన ఉన్న శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో శనివారం హనుమత్ రక్ష యాగం పూర్ణాహుతిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉగాది పర్వదినం రోజున ప్రారంభమైన యాగంలో దేశ, విదేశాల నుంచి భక్తులు హాజరయ్యారు. హనుమాన్ చాలీసా పారాయణం, రామనామలేఖన కార్యక్రమంలో పాల్గొన్నారు. లోక క్షేమం, దేశ వైభవ సిద్ధి ధ్యేయంగా సాగిన పారాయణం ముగింపు రోజు పూర్ణాహుతి, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు.

విద్యార్థి జాషువాకు నగదు బహుమతి

రొంపిచర్ల: ఈ ఏడాది కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన నందిగం జాషువాకు అదే గ్రామానికి చెందిన పఠాన్ రంజాన్ బీ రూ.5 వేల నగదు బహుమతిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రంజాన్ బీ మాట్లాడుతూ చదువులో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగదు అందించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన జాషువాను ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, గ్రామపెద్దలు నందిగం దాసు, శ్యాంబాబు కుటుంబ సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిలకలూరిపేటకు చెందిన శ్రీను కుమారుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై యడ్లపాడు వస్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తిమ్మాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో శ్రీను, అతని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే పోలీసులు బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సేవకు దూరం.. రైతుకు శాపం

- రేషనలైజేషన్ పేరుతో రైతు సేవా కేంద్రాల కుదింపు
- వాటి నిర్వీర్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ఇప్పటికే దూరమవుతున్న సేవలు

మండలాల వారీగా నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాలు ఇలా...

మండలం	ప్రస్తుతం	రేషనలైజేషన్ తర్వాత
సత్తెనపల్లి	19	17
ముప్పాళ్ళ	13	8
రాజుపాలెం	14	12
నకరికల్లు	14	12



నార్నెపాడులోని రైతుసేవా కేంద్రం

ముప్పాళ్ళ: అన్నదాతలకు అన్ని విధాలా అండగా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)ను ఏర్పాటు చేసింది. ఈ ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తు నుంచి పంట విక్రయం వరకు అన్ని రకాల సేవలను అందజేశారు. రైతుల సాగుకు అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు, పంటల సాగుకు అవసరమైన సలహాలు, ఈ-క్రాప్ నమోదు, ఈ కేవైసీ, ధాన్యం కొనుగోలు, పశుదాణా సరఫరా తదితర సేవలను అందించేలా తీర్చిదిద్దారు. ప్రతి గ్రామంలోను లక్షల రూపాయల నిధులతో సొంత భవనాలు నిర్మించి సేవలందించారు. రైతులు కూడా సాగుకు అవసరమైన అన్ని రకాల సేవలు సొంత గ్రామంలోనే పొందారు. అన్నదాతలకు అన్ని విధాలుగా ప్రయోజనం ఉన్న రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిందే తప్ప సేవలందించటంలో మాత్రం చిత్తశుద్ధి చూపటం లేదు. కేవలం కుట్ర పూరితంగానే రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు తెర తీశారు.

రేషనలైజేషన్ పేరుతో కుదింపు

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సాగుకు అవసరమైన రాయితీ విత్తనాలు ఇవ్వడం మానేసింది. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందించారు. అది కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా కాకుండా సహకార సంఘాల ద్వారా విక్రయాలను చేపట్టారు. ఈ ఏడాది సాగు చివరిలో యూరియా అందక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రెండు వేల ఎకరాలు సాగులో ఉండే గ్రామాల్లో మాత్రమే రైతు సేవా కేంద్రాలను కొనసాగించాలని నిర్ణయించి కుదింపు అమలుకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు నివేదికలు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే నియోజకవర్గాల్లో చాలా రైతు సేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితులు వస్తాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇది రైతులకు శాపంలా పరిణమించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో ప్రయోజనం ఉండేది



రైతు భరోసా కేంద్రాల వలన ఎంతో ప్రయోజనం కలిగింది. విత్తనాలు, ఎరువులు సాగుకు అవసరమైన అన్ని సేవలు ఊరిలోనే అందేవి. వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా అందుబాటులో ఉండి పంటకు ఏమైనా తెగులు, పురుగు ఆశించిందని చెప్పిన వెంటనే పొలానికి వచ్చి చూసేవారు. అలాంటి కేంద్రాలను తగ్గించటం రైతులకు ఇబ్బందే. ఏమైనా పురుగుమందులు, విత్తనాలు కొనుక్కోవాలంటే దుకాణాలకు వెళ్లాల్సి వస్తుంది. పైగా అసలో నకిలీనో తెలుసుకోవటం కష్టమవుతుంది.

– అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, చాగంటివారిపాలెం

సేవలు దూరం చేయటం సరైంది కాదు



రైతులకు అవసరమైన సేవలందించే రైతు భరోసా కేంద్రాల పేరు మార్చుకున్నా, సేవలు దూరం చేయటం సరైన నిర్ణయం కాదు. రైతుల కోసం పెట్టిన వాటిపై రాజకీయాలు ప్రదర్శించటం ఎంత వరకు న్యాయం. రైతులకు మేలు చేసేలా ప్రభుత్వ పాలన ఉండాలే తప్ప ఇబ్బందులు పెట్టేలా ఉండకూడదు. కావాలంటే ఇంకా మరిన్ని సేవలు పెట్టొచ్చు కదా.

– కంబాల వెంకట కోటేశ్వరరావు, కౌలురైతు, దమ్మాలపాడు

భక్తిశ్రద్ధలతో శ్రీలక్ష్మీ నర్సింహస్వామి పవళింపుసేవ



నకరికల్లు: స్థానిక చౌత్రాసెంటర్‌లో శ్రీలక్ష్మీ నర్సింహస్వామి పవళింపు సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొండపై గల ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నర్సింహస్వామి వారి కల్యాణ వేడుకల్లో భాగంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి పవళింపు సేవను శనివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం 16 రోజుల వరకు జరిగే కార్యక్రమాల సందర్భంగా చౌత్రాసెంటర్‌లో స్వామి వార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజన కార్యక్రమం నిర్వహించి స్వామి వారి కీర్తనలు ఆలపించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో రాత్రి పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘చలో విజయవాడ’ను జయప్రదం చేయండి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూరు తాలూకా అధ్యక్షుడు శిఖా శ్యాంసన్

బెల్లంకొండ: జూన్ 5న విజయవాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ కోరారు. శనివారం మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిల్ సమావేశాలలో మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం సమావేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బసవకుమారి, అసోసియేట్ ప్రెసిడెంట్ జె.వి.ప్రసాద్‌రావు, యూనిట్ ఉపాధ్యక్షుడు వీరయ్య ఉద్యోగులు పాల్గొన్నారు.



బెల్లంకొండలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3వ తేదీ నుంచి ఏపీజీఈఏ రాష్ట్ర మహాసభలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛన్‌దారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ బసవకుమారి, వైస్ ప్రెసిడెంట్ జీవన్‌రావు, ఉపాధ్యక్షుడు వీరయ్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: జూన్ 5వ తేదీన విజయవాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీజీఈఏ క్రోసూరు తాలూక యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగ సంఘం సభ్యులు ‘చలో విజయవాడ’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పరిషత్ కార్యాలయంలో గోడ ప్రతులను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రోసూరు యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ పాల్గొన్నారు.



ఏపీజీఈఏ గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గో వధను నిషేధిద్దాం.. హిందూ ధర్మాన్ని కాపాడుదాం

విశ్వహిందూ పరిషత్ మండల ప్రముఖ్ తుమ్మా మర్రెడ్డి

అచ్చంపేట: గో వధను నిషేధించి హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విశ్వ హిందూ పరిషత్ ప్రముఖ్ తుమ్మా మర్రెడ్డి కోరారు. మండలంలోని వేల్పూరు, కోగంటివారిపాలెం గ్రామాలలో ఆయన పర్యటించి, సర్పంచ్‌లు జువ్వా శంకర్, బోనం నాగిరెడ్డిలకు వినతి పత్రాలు అందచేశారు. రానున్న జూన్ 7న బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను, ఇతర జంతువులను వధించే కార్యక్రమాన్ని అడ్డుకోవాలని సూచించారు. గోవులను రక్షించుకోవాలని, గోవుల వల్ల శాస్త్రీయంగా కూడా అనేక ఉపయోగాలున్నాయని సూచించారు. తాము బక్రీద్ పండుగ వరకు ప్రతి గ్రామంలో తిరిగి గోవులను వధించే కార్యక్రమంపై ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబటి నారాయణ, ఆదూరి వెంకటేశ్వరరావు, బూర్లె నరసింహారావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



సర్పంచ్ నాగిరెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్ మర్రెడ్డి

ఇన్నర్ వీల్ క్లబ్ సామాజిక సేవలు అభినందనీయం

చిలకలూరిపేట: సామాజిక సేవలతో పాటు మహిళల్లో న్యాయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఇన్నర్ వీల్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని న్యాయవాదులు నన్నెబోయిన శ్రీనివాసరావు, మాదాసు భానుప్రసాద్ చెప్పారు. పట్టణంలోని సుగాలి కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో శనివారం మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. హక్కులు తెలుసుకుంటేనే వాటిని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యురాలు ఆలేటి రమాదేవి ఆర్థిక సహాయంతో దివ్యాంగురాలైన భీమిబాయికి ట్రై సైకిల్ అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణకు హాజరైన అభ్యాసకులతో కమిషనర్ జస్వంతరావు, జనార్దనరావు గురూజీ

నరసరావుపేట ఈస్ట్: క్రమశిక్షణ, సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన జీవనం యోగా ద్వారా సాధ్యపడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 186వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ఆనంద మహోత్సవంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మే 21 నుంచి జూన్ 21 వరకు మండల, మున్సిపల్ స్థాయిల్లో యోగా తరగతులను నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఈనెల 26వ తేదీ నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో యోగా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగా అభ్యసించాలని ఆయన సూచించారు. యోగ సేవా కేంద్రం ప్రధానాచార్యులు వేంకటేశ్వర గురూజీ ఫోన్ ద్వారా సందేశం అందించారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహక గురూజీ కూనిశెట్టి వెంకట జనార్దనరావు, కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, సహాయకులు మల్లీశ్వరి, పెండ్యాల సత్యనారాయణ, అడ్డగిరి రమేష్ పాల్గొన్నారు.

పరస్పరం ఫిర్యాదులు.. కేసులు నమోదు

సత్తెనపల్లి: జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది, సోషల్ మీడియా యాక్టివిస్ట్ కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై శుక్రవారం దాడి జరిగిన విషయం తెలిసిందే. కూటమి నేతల అవినీతిని ప్రశ్నించినందుకు తనపై పథకం ప్రకారం దాడి చేశారని సాంబశివరావు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అత్తోట అనూష, కాంతారావుతో పాటు మరికొందరిపై పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అలాగే లోన్ ఆఫీస్ ఎక్కడ అని అడిగినందుకు అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా ఛాతీపై చేతులు వేసి నెట్టి దాడి చేశాడని కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై అత్తోట అనూష పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిలో ఎలాంటి రాజకీయ కక్షలు లేవని ఆమె చేసిన ఫిర్యాదు మేరకు కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు రెండు కేసులు పట్టణ పోలీసులు నమోదు చేశారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

చిలకలూరిపేట: రక్తదానం ప్రాణ దానంతో సమానమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ చిలకలూరిపేట రెడ్‌క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌తో పాటు రెడ్ క్రాస్ సంస్థను బలోపేతం చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. చిలకలూరిపేట పట్టణం జాతీయ రహదారిపై విస్తరించి ఉన్న నేపథ్యంలో ప్రమాదాలలో గాయపడిన వారికి రక్తం ఆవశ్యకత ఎంతో ఉంటున్నదని వెల్లడించారు. అనంతరం రక్తదానం చేసిన 21 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, జంపని భాస్కరరావు, చుక్కా విన్సెంట్‌పాల్, ఆర్ఐ రమీజా పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

చిలకలూరిపేట టౌన్ : మద్యం మత్తులో రోడ్డు పక్కన చెట్టు కింద కూర్చున్న వ్యక్తిని కారు ఢీకొట్టిన సంఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట వైపు నుంచి చిలకలూరిపేట వస్తున్న కారు పట్టణంలోని ఎన్నార్టీ రోడ్డు, భారత్ పెట్రోలు బంకు ఎదురుగా వచ్చేసరికి రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లి అదుపుతప్పింది. చెట్టుకింద కూర్చున్న మంగలి షాపు యజమానిని ఢీకొంది. స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు.

లోతుగా దున్నుకుంటే లాభదాయకం

ఏవో అహ్మద్



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న దృశ్యం

అమరావతి: మండలంలోని రైతులు భూమిని లోతుగా దున్నుకుంటే వర్షపు నీరు లోపలికి బాగా ఇంకి, పైర్ల వేళ్ల భూమిలోకి చొచ్చుకుపోయి ఎక్కువ పోషకాలను గ్రహించే అవకాశం ఉందని ఏవో అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పొలాల్లో దుక్కులు దున్నుతున్నారని నాగళ్లతో దున్నటమే లాభదాయకమన్నారు. తేలిక నేలల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండడం వల్ల తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండదన్నారు. పశువులు, జీవాల ఎరువు, పంటల వ్యర్థాలు వంటివి వాడటం వల్ల భూమి గుల్లబారి తేమ, పోషక పదార్థాలను పట్టి ఉంచే శక్తి పెరుగుతుందన్నారు. వేసవి దుక్కి వేసిన తరువాత నీటి వసతి ఉన్న ప్రాంతాలలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. నీటి పరివాహక ప్రాంతాలలోని భూములలో వాలుకు అడ్డంగా దున్నటం వల్ల నేల కోతను నివారించవచ్చన్నారు. లోతు దుక్కులు వేయటం వల్ల కలుపు మొక్కలు వేళ్లతో సహా పెకిలించబడి మట్టితో కలిసిపోతాయని, కలుపు విత్తనాలు భూమిలోనే అధిక ఉష్ణోగ్రతకు నశిస్తాయన్నారు. అలాగే శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, ఎర్ర గొంగళి పురుగు, వేరు పురుగుల అవశేషాలను లోతు దుక్కుల వలన చాలా వరకు తగ్గించవచ్చన్నారు. భూమి లోతుగా దున్నినప్పుడు పై భాగాన ఏర్పడిన గట్టి పొరలు విడిపోయి నేల గుల్లబారి నేల పై పొరలలో గాలిశాతం పెరగటం వల్ల సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెంది సేంద్రియ పదార్థం త్వరగా కుళ్లటానికి తోడ్పడతాయన్నారు. దుక్కులు దున్నటంలో రైతులు ఈ సూచనలు పాటించినట్లయితే కలుపు నివారణ చేయవచ్చునన్నారు.

టీకాల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ గీతాంజలి

ముప్పాళ్ళ: చిన్నారులకు క్రమం తప్పకుండా అందించే టీకాల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గీతాంజలి మాట్లాడుతూ ఆయా సబ్‌సెంటర్‌ల పరిధిలోని పిల్లలు, గర్భిణులకు ప్రతి బుధవారం, శనివారం అందించే టీకాల వివరాలను యు-విన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఈ-సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసి వారికి ఇవ్వాలని చెప్పారు. ఈ-సర్టిఫికెట్ ద్వారా దేశ వ్యాప్తంగా తదుపరి వ్యాక్సిన్‌లను పిల్లలకు వేయించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో యు-విన్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పత్తి శివశంకర్, మండల వైద్యాధికారి వి.జయకృష్ణప్రవీణ్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, దస్తగిరి, సూపర్‌వైజర్ ఎ.పీటర్‌డేమియన్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ప్రమాదం

వినుకొండ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ప్రమాదమని ఎంపీడీవో పుట్టారెడ్డి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. కాలుష్యాన్ని అరికట్టి భవిష్యత్తు తరాలను కాపాడుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి, ఏవో వెంకటరవి, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ పచ్చిగొళ్ల ప్రభాకరరావు, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, నడిగడ్డ మాజీ సర్పంచ్ గోవిందరాజులు, వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేస్తున్న ఎంపీడీవో పుట్టారెడ్డి

నూజెండ్లలో..

మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి రవీంద్ర అధ్యక్షతన ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటరు కంచర్ల సుబ్బరామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు జలకళ

నరసరావుపేట: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే నకరికల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నాగార్జునసాగర్ నీటిని శనివారం నుంచి మళ్లించారు. 267 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ట్యాంకును ఒకసారి పూర్తిగా నింపితే 90రోజుల పాటు పట్టణ ప్రజలకు తాగునీటికి ఢోకా ఉండదు.

ఇటీవల సాగర్ కుడి కాలువకు నాలుగు టీఎంసీలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఎనిమిది రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నారు. బుగ్గ వాగు నుంచి విడుదలైన నీటిని మెయిన్ కెనాల్ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు మళ్లించే ప్రక్రియను మున్సిపల్ ఇంజనీర్ కె.కనకారావు, డీఈ మహమ్మద్ రఫీ పర్యవేక్షించారు.

ప్రారంభమైన పెద్దింటమ్మతల్లి వార్షికోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మతల్లి వార్షికోత్సవ కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. తొలిరోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచామృత స్నపన, విశేష కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలతో నిర్వహించారు. రెండవరోజు ఆదివారం అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల అనంతరం శ్రీలక్ష్మీగణపతి హోమం, శక్తిదుర్గాచండీహోమం, మహాపూర్ణాహుతి నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుందని తెలియజేశారు. ఈ వార్షికోత్సవాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులుకావాలని నిర్వాహకులు కోరారు.